
సాక్షి ఒడిశా
సోమవారం । 21 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 5,05,008లు, బంగారం 10 గ్రాముల 20 మిల్లీ గ్రాములు , వెండి 3 గ్రాములు100 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

సిరా దాడి నిందితుడు విడుదల

ముఖ్యమంత్రి 5టీ కార్యదర్శి వి.కె.పాండియన్‌పై సిరా దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు విడుదల చేశారు. దాడితో అదుపులోకి తీసుకున్న నిందితుని పోలీసులు కాసేపటి తర్వాత విడుదల చేయడం చర్చనీయాంశమైంది. పాండియన్ పూరీ పర్యటన సందర్భంగా శనివారం సిరా దాడికి గురైన విషయం తెలిసిందే. ఆయనతో పాటు పూరీ జిల్లా కలెక్టర్ సమర్థ్ వర్మ సైతం సిరా దాడికి గురయ్యారు.

- 8లో



పేదరిక నిర్మూలనకు రాజీవ్ గాంధీ కృషి

రాష్ట్రంలో పలుచోట్ల దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- 8లో

సినబోయిన చినుకమ్మ..!



ఈ ఏడాది సమయానికి రుతు పవనాలు వస్తున్నాయని, వర్షాలు సక్రమంగా కురుస్తాయని చెప్పడంతో అన్నదాత ఆనందంతో ఉప్పొంగిపోయాడు. జల సిరులు కురిస్తే దిగుబడులు సాధించవచ్చని సాగుకు సమయాత్తమయ్యాడు. తీరా చూస్తే అన్నదాతను కరుణించేందుకు చినుకు మొఖం చాటేసింది. రోజూ చినుకు జాడ కోసం రైతు ఆకాశం వైపు చూస్తున్నా వరుణుడు కరుణ చూపించడం లేదు. ఎప్పుడూ లేనంతగా లోటు వర్షపాతం రాష్ట్రంలో నెలకొనడంతో సాగుజీవి బతుకుజీవుడా అంటూ దిగులు చెందుతున్నాడు. నేల నెర్రలు వారితే నష్టాలు తప్పవని వాపోతున్నాడు.



- రాష్ట్రంలో లోటు వర్షపాతం
- 9 జిల్లాల్లో తీవ్రంగా వర్షాభావం
- ఎల్‌నినో ప్రభావంతో అన్నదాతకు అష్టకష్టాలు

భువనేశ్వర్: రాష్ట్రంలో వర్షాభావం కలవరం రేపుతోంది. ఈ ఏడాది వర్షపాతం సాధారణం కంటే గణనీయంగా తగ్గుముఖం పట్టింది. అప్పడప్పుడు కురిసిన వర్షాలతో పొలాల్లో మొలకెత్తిన విత్తనాల ఫలితం చేతికందే అవకాశాలు సన్నగిల్లుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో 9 జిల్లాల్లో వర్షాభావం ఏర్పడింది. 19 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. నవరంగ్‌పూర్‌లో 40 శాతం కంటే తక్కువ వర్షపాతం రికార్డు అయింది. కేంద్రపడా, గంజాం, రాయగడ, జాజ్‌పూర్, పూరీ, ఖుర్దా, జగత్‌సింగ్‌పూర్‌లో లోటు వర్షపాతంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు సమగ్ర వర్షపాతం సాధారణం కంటే తక్కువగా కొనసాగుతోంది. రాష్ట్రంలో నగటు సాధారణ వర్షపాతం 786 మిల్లీమీటర్లు కాగా, వాస్తవ వర్షపాతం 733 మిల్లీమీటర్లకు పరిమితమైంది.

ఆగస్టు నిరాశాజనకం

సాధారణంగా జూలై, ఆగస్టు రెండు నెలల్లో రాష్ట్రంలో ఆశాజనకంగా వర్షాలు కురుస్తాయి. ఈ ఏడాది ఆగస్టు నెలలో వర్షాల లోటుతో రైతాంగం తల్లడిల్లుతుంది. ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలో పంట భూములు బీటలు వారే ముప్పు తప్పదని వ్యవసాయ ఉత్పాదన వర్గాలు కలవరపడుతున్నాయి. వర్షాధార పంట పొలాలు ఈ విపత్తుని ఎదుర్కోవాల్సిన పరిస్థితులు పొంచి ఉన్నట్లు భావిస్తున్నారు. సాగునీటి పారుదల సౌకర్యం లేని ప్రాంతాల్లో రుతు పవనాల వానలే ఆధారం. ఈ వర్గం వాన కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తోంది.

7 శాతం లోటు

ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో సగటున సాధారణం కంటే 7 శాతం తక్కువ వర్షపాతం రికార్డు కావడం విచారకరం. 9 జిల్లాలు జాజ్‌పూర్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, ఖుర్దా, పూరీ, గంజాం, కలహండి, రాయగడ, నవరంగపూర్ ప్రాంతాల్లో 19 నుంచి 40 శాతం పైబడి సాధారణం కంటే తక్కువగా వర్షం కురిసింది.

పొడి వాతావరణం

వానల కోసం రైతులు నిరీక్షిస్తున్న తరుణంలో వాతావరణం అందుకు ప్రతికూలంగా ఉందని విశ్లేషకులు తెలియజేస్తున్నారు. ఈనెల 27, 28వ తేదీ వరకు రాష్ట్రంలో చెప్పుకోదగ్గ వర్షాలు కురిసే అవకాశం లేవని వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ శరత్ చంద్ర సాహు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఆగస్టులో దేశవ్యాప్తంగా పొడి వాతావరణం నెలకొని ఉంటుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో అంతంత మాత్రంగా మొలకెత్తిన పంటలు నిలబడేందుకు వర్షాల సహకారం ఎంతైనా అవసరమని పేర్కొన్నారు.

రికార్డు స్థాయిలో లోటు

ఈనెలలో లోటు వర్షపాతం రికార్డు నెలకొల్పుతుందని మరో వైజ్ఞానికుడు మాధవన్ రాజీవన్ ముందస్తు అంచనాగా పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ పరిస్థితి తాండవిస్తోందని, జాతీయ స్థాయిలో లోటు వర్షపాతం ఉంటుందని అభిప్రాయపడ్డారు. సగటున 40 శాతం వరకు లోటు వర్షపాతం సంకేతాలు ఉన్నట్లు పేర్కొన్నారు. 2005 సంవత్సరంలో అత్యధికంగా 25 శాతం తక్కువ వర్షపాతం రికార్డవ్వడం కలకలం రేపింది. ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు రుతుపవనాలు బలహీనంగా ఉంటాయి. ఉత్తర భారతదేశంలో భారీగా వర్షాలు కురిసినా కేంద్ర, దక్షిణ భారత దేశంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది. ఈ ఏడాది ఆగస్టు నెల తొలి 18 రోజుల సగటు వర్షపాతం సాధారణం కంటే 38 శాతం తక్కువగా నమోదయ్యింది.

ఆశలన్నీ సెప్టెంబర్‌పైనే...

ఆగస్టు నెలలో ఆశించిన మేరకు వర్షం కురవకపోవడంతో రైతుల ఆశలన్నీ ప్రస్తుతం సెప్టెంబర్‌పైనే ఉన్నాయి. సెప్టెంబర్‌లో లోటు వర్షపాతం కొంత వరకు భర్తీ అవుతుందని ఆశిస్తున్నారు. అయితే ఆగస్టు నెలలో విపరీతంగా ప్రభావితం చేసిన ఎల్‌నినో వచ్చే నెలలో సైతం వర్షపాతంపై స్వల్ప ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. దీని ప్రభావంతో సెప్టెంబర్‌లో కూడా 10 శాతం వరకు ప్రభావితయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ అంచనా మేరకు సెప్టెంబర్‌లో 100 శాతం సాధారణ వర్షపాతం కష్టమేనని తెలుస్తోంది. అయితే కాలం కలిసి వస్తే అత్యధికంగా 90 శాతం వరకు సాధారణ వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

ఈనెల 23 నుంచి వర్షాలు..?

ఈనెల 23వ తేదీ నుంచి రాష్ట్రంలో వానలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు బలంగా పుంజుకుంటున్నాయి. సుందరగడ్, సంబలపూర్, ఝార్సుగుడ, దేవ్‌గడ్, అంగుల్, కెంజొహర్, మయూర్‌భంజ్, బాలేశ్వర్, భద్రక్, ఢెంకనాల్, కటక్, నయాగడ్, ఖుర్దా, పూరీ, గంజాం, కంధమల్ జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ అయింది.

న్యూస్‌రీల్

నకిలీ సర్టిఫికెట్ల బాగోతం

- 12 మంది ఉపాధ్యాయులు తొలగింపు

రాయగడ: విద్యాశాఖలో నకిలీ సర్టిఫికెట్ల బాగోతం బట్టబయలయ్యింది. దర్యాప్తు చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణ చంద్ర భోరియా 12 మంది ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల నుంచి తొలగించబడిన వారిలో ఏడుగురు నకిలీ బీఈడీ సర్టిఫికెట్లతో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించినవారు కాగా, మరొకరు సిటి, ఇద్దరు ప్లస్-2, ప్లస్-3 సర్టిఫికెట్లు నకిలీవిగా దర్యాప్తులో తేలిందని ఆయన పేర్కొన్నారు. నకిలీ బీఈడీ సర్టిఫికెట్లు దాఖలు చేసినవారిలో చంద్రపూర్ సమితిలోని గణేష్ చంద్ర బిసాయి, పార్థేందు బారిక్, కాసీపూర్ సమితిలోని లోక్‌నాథ్ మహాపాత్రొ, మునిగుడ సమితిలోని సుమిత్ర దకువ, శ్రీకాంత్ కుమార్ దాస్, పూర్ణచంద్ర సాబొరొ, కొలనార సమితిలోని హరీష్ కుమార్ పండాలు ఉన్నట్లు వెల్లడించారు. అదేవిధంగా నకిలీ సిటి సర్టిఫికెట్‌తో జిల్లాలోని కాసీపూర్‌లో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న పంజాబ్ మాఝి తదితరులు విధుల నుంచి తొలగించబడిన వారిలో ఉన్నారు.

భార్యను కొట్టి చంపిన భర్త



నిందితుడు మాధవ భూమియ

జయపురం: ఒక వ్యక్తి తన భార్యను ఇనుప రాడ్డుతో కొట్టి చంపిన ఘటన జయపురం సమితి ఉమ్మిరి గ్రామ పొరజవీధిలో చేటుచేసుకుంది. ఘటనపై సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపిన వివరాలు మేరకు.. పొరజ వీధిలో మాధవ భూమియ(45), అతడి భార్య మోతి భూమియలు నివాసముంటున్నారు. శనివారం వారిద్దరి మధ్య ఏదో కారణంతో గొడవ జరిగింది. క్రమేపీ మాటామాటా పెరగడంతో కోపంతో భర్త మాధవ భూమియ ఇనుప రాడ్డుతో భార్యను తీవ్రంగా కొట్టాడు. వెంటనే స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఆమె బంధువుల ఫిర్యాదు మేరకు మాధవను అరెస్టు చేశారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మోతి భూమియ మరణించినట్లు పోలీసులు పేర్కొన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర పండ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీని తగలబెట్టిన దుండగులు



తగలబడిన లారీ

రాయగడ: గంజాం జిల్లా అస్కా నుంచి కోల్‌కతాకు సియన్ పెయింట్ రంగు డబ్బాల లోడ్‌తో వెళ్తున్న లారీని జిల్లాలోని రామనగుడ పోలీసుస్టేషన్ పరిధిలోని పరక్షితి ఘాటీ వద్ద శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు తగలబెట్టారు. వివరాల్లోకి వెళ్తే.. రామనగుడ సమితిలోని పరక్షితి ఘాటీ వద్దకు చేరకున్న సమయంలో లారీ మరమ్మతులకు గురయ్యింది. దీంతో లారీ డ్రైవర్, హెల్పర్ మెకానిక్‌ను తీసుకొచ్చేందుకు రామనగుడ వెళ్లారు. అయితే ఆ సమయంలో కొందరు గుర్తు తెలియని దుండగులు లారీకి నిప్పుపెట్టి వెళ్లిపోవడంతో రంగు డబ్బాలు సగం వరకు కాలిపోయాయి. ఇది గమనించిన కొందరు వ్యక్తులు వెంటనే నీటితో మంటలను అదుపుచేసే చర్యలు తీసుకున్నారు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అయితే లారీ డ్రైవరు, హెల్పర్ పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక విద్యపై అవగాహన

పర్లాకిమిడి: గజపతి జిల్లా బెత్తగుడ గ్రామం వద్దనున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, ఛెలిగడ జలవిద్యుత్ ప్రాజెక్టు పునరావాస కుటుంబాల విద్యార్థులను రెండు బస్సుల్లో భువనేశ్వర్‌లోని వరల్డ్ స్కిల్ డవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఎడ్యుకేషన్ టూర్‌కు జిల్లా అధికారులు తీసుకెళ్లారు. ఆదివారం సాయంత్రం ఈ బస్సులను కలెక్టర్ స్మృతి రంజన్‌ప్రధాన్ తన నివాసం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. మొత్తం రెండు బస్సులలో 91 మంది విద్యార్థులను రాజధాని మంచేశ్వర్ వద్దనున్న ప్లాస్టిక్ ఇండస్ట్రీ, వరల్డ్ నైపుణ్య విద్యాసంస్థకు తీసుకెళ్లి సాంకేతిక విద్యపై అవగాహన కల్పిస్తారు. విద్యార్థులతో పాటు అధికారులు ఉన్నారు.

నలుగురు నిందితులు అరెస్టు



దుండగులు తగలబెట్టిన ద్విచక్ర వాహనం



అరెస్టు చేసిన నిందితులును చూపిస్తున్న పోలీసులు

రాయగడ:

ఇసుక అక్రమ రవాణా చేయడమే కాకుండా, అడ్డుకున్న ముగ్గురు వ్యక్తులపై దాడిచేసి తీవ్రగాయాలకు గురిచేసిన ఘటనలో మునిగుడ పోలీసులు ఎట్టకేలకు నలుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. మునిగుడ ఎస్డీపీవో సంతోషిని ఒరం తెలిపిన వివరాల మేరకు... సమితిలోని దేవుకుపిలి నుంచి అంబొదళ వయా గొమటిగుడ గ్రామం వరకు ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. దీని టెండర్ తరాతరణి అనే ప్రైవేట్ సంస్థ తీసుకుంది. ఈ నేపథ్యంలో రహదారి నిర్మాణంలో భాగంగా ఖిల్లాపాదొరొ గ్రామంలో ఇసుక నిల్వలను సంస్థ ఉంచింది. అయితే ఈనెల 3వ తేదీన నలుగురు దుండగులు అర్ధరాత్రి వేళఆ ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలించేందుకు సన్నాహాలు చేస్తుండగా, విషయం తెలుసుకున్న సైట్ ఇన్‌చార్జి దిలీప్ కుమార్ ప్రధాన్‌తో పాటు అతని సహచరులు అడ్డుపడ్డారు. దీంతో దుండగులు వీరిని గాయపరచడంతో పాటు వారికి సంబంధించిన బైకును తగులబెట్టారు. ఈ నేపథ్యంలో ఈనెల 16వ తేదీన ఈ విషయమై అంబొదళ పోలీసుస్టేషన్‌లో దిలీప్ కుమార్ ప్రధాన్ ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు అందుకు సంబంధించి నలుగురిని అరెస్టు చేశారు. అనంతరం నిందితులను కోర్టుకు తరలించారు. అరెస్టైనవారిలో సమితిలోని పొడిమస్కా గ్రామానికి చెందిన రాజేష్ దళబెహర, పింటు అంబాడి, కినాం గ్రామానికి చెందిన గోపినాథ్ ఆర్జ, కృష్ణ కొత్తపిలుకలు ఉన్నారు.

1,260 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్టు చేసిన వ్యక్తులతో పోలీసులు

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 1,260 కిలోల గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకొని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి ఉదయ చంద్ర మహంతి తెలిపిన వివరాల మేరకు.. కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు ఆదివారం సమాచారం అందింది. దీంతో అబ్కారీ గోవింద విభాగం అధికారులు నగరానికి సమీపంలోని 5వ నంబర్ జాతీయ రహదారి హల్దియాపదర్ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో ఒక పికప్ వ్యాన్ తనిఖీ చేయగా 10 బస్తాల్లో 1,260 కిలోల గంజాయి బయటపడింది. దీంతో డ్రైవర్, మరో వ్యక్తిని అరెస్టు చేశారు. అలాగే వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

తెలుగు యోధుల పుస్తక ఆవిష్కణ



పుస్తక అవిష్కరణ చేస్తున్న దృశ్యం

బరంపురం: స్థానిక ధర్మనగర్‌లోని రోటరీ క్లబ్ (ఈస్ట్) ప్రాంగణంలో ఆంధ్ర భాషాభివర్ధిని సమాజం ఆధ్వర్యంలో రచయిత, అనువాదకర్త డా.తుర్లపాటి రాజేశ్వరి తెలుగు భాషలో రచించిన 'భారత స్వాతంత్ర్యోద్యమంలో ఒడిశా తెలుగు యోధుల' పుస్తక ఆవిష్కణ సభ ఆదివారం జరిగింది. సమాజం అధ్యక్షుడు పూడిపెద్ది సత్యనారాయణ (బాబు) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగార్జున యూనివర్సిటీ విశ్రాంతాచార్యులు ప్రొ.బాలమోహన్ దాస్ ప్రారంభ జ్యోతిని వెలింగించారు. అనంతరం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్రిటీష్ సామ్రాజ్యవాదంపై దేశవ్యాప్తంగా సమర సన్నాహము 1920 నుంచి ప్రారంభమైందని తెలిపారు. మహాత్మాగాంధీ పిలుపునకు యావద్దేశం కదిలినట్లే విశాఖ, గంజాం జిల్లాలను కూడా ప్రభావితం చేసిందని వెల్లడించారు. ఈ సంగ్రామంలో గంజాం జిల్లా బరంపురంలోని ఆంధ్ర భాషాభివర్ధిని సమాజం అగ్రశ్రేణిలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో సమాజం కార్యదర్శి రవికుమార్ గుప్త, ఆంధ్ర మిత్ర మండలి ఉపాధ్యక్షుడు ఎస్.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నదిలో వృద్ధురాలు గల్లంతు..?



నదిలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: మరుభూమికి వెళ్లిన 64 ఏళ్ల వృద్ధురాలు కొలాబ్ నదిలో గల్లంతైన ఘటన బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి మొసిగాం పంచాయతీ బొరగాం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బొరిగాం గ్రామానికి చెందిన చంపావతి హరిజన్(64) శనివారం తమ పశువులను మేపేందుకు వెళ్లి సాయంత్రం 5.30 గంటలకు ఇంటికి తిరిగి వచ్చింది. అనంతరం ఆమె మరుభూమి కోసం గ్రామ సమీపంలోని కొలాబ్ నది ప్రవాహిత ప్రాంతానికి వెళ్లింది. తర్వాత ఆమె ఇంటికి రాకపోవడంతో భర్త లక్ష్మణ హరిజన్ వెతికేందుకు వెళ్లాడు. అనంతరం నది పరిసర ప్రాంతాల్లో వెతకగా, నదిలో ఆమె వస్తువులు కనిపించడంతో నదిలో పడిపోయి ఉంటుందన్న అనుమానంతో గ్రామస్తులకు తెలియజేశాడు. గ్రామస్తులు వచ్చి నదిలో ఎంత గాలించినా ఆమె జాడ తెలియలేదు. అనంతరం కుంద్ర అగ్నిమాపక విభాగానికి తెలియజేయగా, అగ్నిమాపక అధికారి పితాంబర బైరాగి తన సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఇంతవరకు చంపావతి హరిజన్ ఆచూకీ తెలియలేదు.

రాష్ట్రంలో ఉన్నత ప్రమాణాలతో విద్య

- మంత్రి జగన్నాథ సరక



మాట్లాడుతున్న మంత్రి సరక, వేదికపై పట్నాయక్, నాయక్, నెమలపూరి తదితరులు

రాయగడ: రాష్ట్రంలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందించేందుకు సీఎం నవీన్ పట్నాయక్ కృషి చేస్తున్నారని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. జిల్లాలోని బిసంకటక్‌లో ఉన్న మా మార్కమ ప్లస్-2, ప్లస్-3 కళాశాల అభివృద్ధికి సీఎం రూ.1.25 కోట్లను మంజూరు చేయడంతో స్మార్ట్ తరగతులు, డిజిటల్ బోధన, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కళాశాల తరుపున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేసేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమం శనివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సరక మాట్లాడుతూ.. జిల్లాలో అత్యధిక శాతం మంది ఆదివాసీ, హరిజన తెగలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా శ్రద్ధతో చదువుకొని లక్ష్యాన్ని చేరుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉమాశంకర్ నెమలపూరి మాట్లాడుతూ బిసంకటక్‌లోని మా మార్కమ కళాశాలలో 1,600 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. బిసంకటక్, మునిగుడ, అంబొదల, రాయగడ, కాసీపూర్ తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే కళాశాలలో వసతులు కరువవ్వడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో, వెంటనే ఆయన స్పందించి రూ.1.25 కోట్లు మంజూరు చేశారని వెల్లడించారు. కళాశాల అభివృద్ధికి ఎంతగానో సహకరించిన ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిసంకటక్ సమితి వైస్ చైర్మన్ దేవిప్రసాద్ పట్నాయక్, బీడీవో సదాశివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మా మార్కమ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

క్లుప్తంగా

ఆటో ట్రాలీ తిరగబడి కార్మికుడు మృతి


బుద్ధుదాస్ మృతదేహం

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి గురండి పోలీసుస్టేషన్ పరిధిలోని కోయిటాడ గ్రామం వద్ద ఒక ఆటో ట్రాలీ ఓవర్ లోడ్‌తో ఇనుప పైపులు తీసుకెళ్తుండగా వెనక్కి ఒరిగి పోవడంతో కార్మికుడు మృత్యువాత పడ్డాడు. సంఘటనా స్థలానికి గురండి పోలీసుస్టేషన్ అధికారి (ఐఐసీ) రవీంద్ర పాత్రో విచ్చేసి మృతుని వివరాలు సేకరించారు. వివరాల్లోకి వెళ్తే.. కోయిటాడ గ్రామానికి తాగునీటి పైపులు వేయడానికి ట్రాలీ ఆటోలో ఇనుప పైపులను తీసుకెళ్తున్నారు. అయితే అధిక లోడుతో ఉన్న ఆటో వెనక్కి ఒరిగిపోవడంతో అందులో ఉన్న కార్మికుడు బుద్దు దాస్‌పై పైపులు పడిపోయాయి. దీంతో కార్మికుడు సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు బుద్దుదాస్ గంజాం జిల్లా ఛత్రపూర్ పోలీసుస్టేషన్ పరిధి జోర్‌పోఖోరీ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత గజరాల్ మృతి


రంజన్ కుమార్ గుజరాల్(ఫైల్)

జయపురం: కొరాపుట్ జిల్లా కోట్‌పాడ్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రంజన్ కుమార్ గుజరాల్ మరణించారు. విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. దీంతో జిల్లా కాంగ్రెస్ శ్రేణులు విషాదంలో మునిగిపోయారు. ప్రజల సందర్శనార్థం ఆయన మృతదేహాన్ని నివాస భవనానికి తీసుకొచ్చారు. దీంతో మృతదేహానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్, కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గా శంకర సాహు, డీసీసీ మాజీ అధ్యక్షురాలు మీనాక్షీ బాహిణీపతి, ప్రదేశ్ కాంగ్రెస్ సభ్యుడు మణిప్రసాద్ పట్నాయిక్, కోట్‌పాడ్ నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్ చైర్‌పర్సన్ ఎం.శంకరరావు, కోట్‌పాడ్ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బపూన్ త్రిపాఠీ తదితరులు సంతాపం తెలియజేశారు.

రిజర్వాయర్‌లో యువకుడి మృతదేహం


రిజర్వాయర్‌లో పడి మృతి చెందిన నాగరాజు

బొండపల్లి (మెంటాడ): మండంలలోని ఆంద్ర రిజార్వాయర్‌లో లోతుగెడ్డ గ్రామానికి చెందిన యువకుడు మృతదేహం లభ్యమైంది. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎలిగరపు నాగరాజు(24) మృతదేహాన్ని రిజర్వాయర్‌లో స్థానికులు గుర్తించి బయటకు తీసి ప్రమాదవశాత్తు జారిపడి ఉండవచ్చని భావించి ఆంద్ర పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనాస్థలానికి వచ్చి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరంలోని సీహెచ్‌సీకి తరలించారు.

బెదిరించి.. దోపిడీ

విజయనగరం క్రైమ్: విధులు పూర్తిచేసుకుని ఇంటికి బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఇద్దరు ఆగంతుకులు బెదిరించి, చితక్కొట్టి, డబ్బు దోపిడీ చేశారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పూల్‌బాగ్‌లో నివాసం ఉంటున్న గ్రంధి సత్యనారాయణ రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్నాడు. విధులు పూర్తయిన తర్వాత శనివారం రాత్రి ఇంటికి వెళ్తుండగా పూల్‌బాగ్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు బైక్ ఆపి, చితక్కొట్టి అతని దగ్గరున్న రూ.10వేలు నగదు పట్టుకుని పరారయ్యారు. దీంతో బాధితుడు టూటౌన్ పోలీసులును ఆశ్రయించాడు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

జొన్నవలస గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 21 వేల 430 స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై గణేష్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జామిలో ఏడుగురు..

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామ శివారులో జరుగుతున్న పేకాటశిబిరంపై జామి ఎస్సై వీరబాబు, ఏఎస్సై నర్సింగరావు, హెచ్‌సీ ఈశ్వరరావు, సిబ్బంది ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఘటనా స్థలంలో ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని రూ.51,590 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేస్తామని, పేకాట, ఇతర పందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

సిరా దాడి నిందితుడు విడుదల


భాస్కర్ సాహు

భువనేశ్వర్: ముఖ్యమంత్రి 5టీ కార్యదర్శి వి.కె.పాండియన్‌పై సిరా దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు విడుదల చేశారు. దాడితో అదుపులోకి తీసుకున్న నిందితుని పోలీసులు కాసేపటి తర్వాత విడుదల చేయడం చర్చనీయాంశమైంది. పాండియన్ పూరీ పర్యటన సందర్భంగా శనివారం సిరా దాడికి గురైన విషయం తెలిసిందే. ఆయనతో పాటు పూరీ జిల్లా కలెక్టర్ సమర్థ్ వర్మసైతం సిరా దాడికి గురయ్యారు.

అంగీకార పత్రంపై సంతకం చేయడంతో...

సత్యబాది అసెంబ్లీ సెగ్మెంట్ ప్రాంతం కొణాస్ మండలం పరిధిలోని హరిపూర్ గ్రామానికి చెందిన భాస్కర్ సాహు భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం చేయబోనని అంగీకార పత్రంపై సంతకం చేయడంతో పోలీసులు విడుదల చేశారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రైవేట్ సెక్రటరీ (5టీ) వి.కె. పాండియన్ 2000 సంవత్సరపు బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆయన రెండు రోజుల జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఉత్కళమణి గోపబంధు స్మృతి మహా విద్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైన సమయంలో ఆయనపై సిరా విసిరారు.

ఇదివరకే...

లోగడ పాండియన్‌పై గుడ్లతో దాడి జరిగింది. ఆ సందర్భంగా నిందిత వ్యక్తిని ఎటువంటి కేసులు వగైరా ఇబ్బందులు లేకుండా విడుదల చేశారు. ఈ క్రమంలో నిందిత, అసంతృప్త వర్గాల మనసు దోచుకునే ప్రయత్నం కొనసాగుతుంది. 2018 సంవత్సరంలో పాండియన్‌పై ఒక మహిళ కోడిగుడ్లు రువ్వి సంచలనం రేపింది. పలు సందర్భాల్లో వివిధ ప్రాంతాల్లో నల్ల జెండాలతో స్థానికుల నిరసనకు గురైన దాఖలాలు లేకపోలేదు. తాజా సంఘటన త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల వ్యూహంగా ప్రధాన రాజకీయ పార్టీ వర్గాల్లో చర్చ బలం పుంజుకుంటుంది.

సిరా దాడి చర్చనీయాంశం

పూరీ జిల్లాలో తాజాగా దాడికి గల కారణాలు తెలియరాలేదు. నిందిత వ్యక్తి ఎల్‌ఐసీ ఏజెంట్, సామాజిక కార్యకర్త అని ఆయన భార్య మీడియాకు తెలిపింది. గత కొద్ది నెలలుగా గంగువా కాలువ సమస్య పరిష్కారానికి నిరవధికంగా ఉద్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక (సత్యబాది) ఎమ్మెల్యే ఉమాకాంత సామంత రాయ్ మరియు జిల్లా కలెక్టర్‌ను కూడా సంప్రదించాడు. ఈ వర్గాల నుంచి ఎటువంటి సానుకూల స్పందన రాకపోవడంతో అతను సిరా దాడికి పాల్పడినట్లు సమాచారం. భర్త చర్యపై గర్విస్తూ ఆద్యంతం మద్దతుగా నిలుస్తానని ఆయన భార్య బాహాటంగా ప్రకటించింది. రాజకీయ పార్టీలతో తమకు ఎటువంటి ప్రమేయం లేదని స్పష్టం చేసింది. స్థానిక ఎమ్మెల్యే వర్గాలు నిందితుడు ప్రధాన విపక్షం బీజేపీ అనుచరునిగా చేసిన ప్రచారాన్ని భారతీయ జనతా పార్టీ నిరాకరించింది.

ఈహెచ్‌ఎస్ రోగులకు క్రానిక్ ఓపీ

- ఏరియా ఆస్పత్రుల్లో నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో క్రానిక్ ఓపీలో రోగిని చూస్తున్న వైద్యురాలు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పాటుపడుతోంది. వారి కోసం ప్రత్యేక ఓపీ నిర్వహించి అవసరమైన వైద్యాన్ని అందించనుంది. ఇప్పటికే ఒకటి రెండు ఆస్పత్రుల్లో క్రానిక్ ఓపీ నిర్వహిస్తుండగా మిగతా ఆస్పత్రుల్లో కూడా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయా ఆస్పత్రులు ఓపీ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాయి. జిల్లాలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఈహెచ్‌ఎస్ (ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్) కింద ప్రభుత్వ ఉద్యోగులకు క్రానిక్ ఓపీ ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. ఇకపై పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రి, ఎస్.కోట, గజపతినగరం, రాజాం ప్రాంతీయ ఆస్పత్రుల్లో కూడా క్రానిక్ ఓపీ నిర్వహించనున్నారు. జిల్లాలో ఈహెచ్‌ఎస్ లబ్ధిదారులు 60 వేల మంది ఉన్నారు. వారంతా ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించే ప్రత్యేకమైన క్రానిక్ ఓపీ సేవలను ఇకపై పొందనున్నారు. క్రానిక్ ఓపీలో ఒక్కోరోజు ఒక్కో ప్రత్యేకమైన స్పెషలిస్టు వైద్యులు సేవలు అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులను పరీక్షించి అవసరమైన మందులు అందజేస్తారు. క్రానిక్ ఓపీలో 25 రకాల వ్యాధులకు సేవలు అందిస్తారు.

పేదరిక నిర్మూలనకు రాజీవ్ గాంధీ కృషి


జయపురం: మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జయపురం: దేశ ప్రగతికి, పేదరిక నిర్మూలనకు స్వర్గీయ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ఎనలేని కృషి చేశారని కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గా శంకర సాహు తెలియజేశారు. స్థానిక జిల్లా కాంగ్రెస్ భవనంలో రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దుర్గా శంకర సాహు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ తన పాలనలో అనేక సంస్కరణలతో పాటు, పేదరిక నిర్మూలన, ఆదివాసీ, హరిజన, బడుగు వర్గాల ఆర్థిక, సామాజిక ప్రగతికి పలు కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. ఆయన మరణించేంత వరకు తన జీవితాన్ని ప్రజల కోసమే అంకితం చేశారని కొనియాడారు. కొరాపుట్ జిల్లాలో కాంగ్రెస్ గత వైభవం పొందేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ కాంగ్రెస్ సెల అధ్యక్షుడు హసన్ మదాని, కాంగ్రెస్ రాష్ట్ర సేవాదళ్ మాజీ అధ్యక్షుడు బిరెన్ మోహన పట్నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు బినోద్ మహాపాత్రో, సీనియర్ నేత మదన మోహన్ నాయిక్, జిల్లా ఎస్టీ కాంగ్రెస్ సెల్ మాజీ అధ్యక్షుడు రామ నాయక్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వెంకటరావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ గోవింద పాత్రో తదితరులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆహా ఎర్ర సీతాఫలం



సీతంపేట: స్థానిక మార్కెట్‌కు అడ్డంగికి చెందిన గిరిజన రైతు ఎర్ర సీతాఫలం ఆదివారం తీసుకువచ్చాడు. వీటిని కొనుగోలు చేయడానికి వ్యాపారులు పోటీ పడ్డారు. ఒక బుట్ట రూ.700లు ధర పలికింది. సాధారణ బుట్ట సీతాఫలం రూ.400ల వరకు గిరిజనులు ఆదివారం విక్రయించారు. ఎర్ర సీతాఫలం మాత్రం మరో రూ.300లు ఎక్కువ ధర పలికింది. ఈ పండు తినడానికి చాలా రుచికరంగా ఉండడంతో మంచి డిమాండ్ నెలకొంది.

చట్టాలపై అవగాహన అవసరం

పార్వతీపురం టౌన్: ఆశాజ్యోతి చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరావు ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి బాలల చట్టపరమైన హక్కులు గూర్చి వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి జి.యజ్ఞ నారాయణరావు బాలకార్మిక వ్యవస్థకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్ ప్రజలకు సంబంధించిన అనేక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ మంచిపల్లి శ్రీరాములు, ఆశాజ్యోతి ఆశ్రమం ముఖ్య సలహాదారులు బడే నాగభూషణరావు, చెరుకూరు జగదీశ్వరరావు, పెంట సాయికిరణ్, ఆశ్రమ దాతలు వూన్న మోహనరావు, గౌరీశంకరరావు, రెడ్‌క్రాస్ ట్రెజరర్ పెంటపాటి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

విజయవిహారం


విజయనగరం జట్టుతో సెలెక్టర్ సర్ఫరాజ్, కోచ్

- అండర్-16 క్రికెట్ టోర్నీలో జిల్లా క్రీడాకారుల జైత్రయాత్ర

విజయనగరం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్- 16 విభాగంలో జరుగుతున్న అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో విజయనగరం జట్టు జైత్రయాత్ర కొనసాగిస్తోంది. వరుసగా జరిగిన రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. జిల్లా కేంద్రంలోని బాబామెట్ట శివారు విజ్జీ క్రికెట్ మైదానంలో విజయనగరం, శ్రీకాకుళం జట్ల మధ్య శనివారం ప్రారంభమైన మూడు రోజుల మ్యాచ్‌లో విజయనగరం జట్టు ఒక రోజు మిగిలి ఉండగానే శ్రీకాకుళం జట్టుపై 5 వికెట్ల తేడాతో గెలుపొందింది.

మ్యాచ్ వివరాలు

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న విజయనగరం కెప్టెన్ శ్రీరామ్ సచిన్ నిర్ణయం సరైనదేనని నిరూపిస్తూ జట్టు బౌలర్లు శ్రీకాకుళం జట్టును శనివారం తక్కువ స్కోర్‌కే కట్టడి చేశారు. విజయనగరం బౌలర్ల ధాటికి శ్రీకాకుళం జట్టు 116 పరుగులకే ఆలౌటైంది. విజయనగరం జట్టు బౌలర్లలో తరుణ్ 4 వికెట్లు, ప్రీతమ్, ఫణీంద్ర రెండేసి వికెట్లు సాధించారు. తరువాత తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు మొదట్లో తడబడినా ఇన్నింగ్స్‌లో 138 పరుగులకు ఆలౌటై 22 పరుగుల కీలక ఆధిక్యాన్ని సాధించింది. ఆదివారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు మరోసారి స్వల్ప స్కోర్‌కే (103) అవుటైంది. విజయనగరం జట్టు బౌలర్లలో ప్రీతమ్, ఫణీంద్రలు నాలుగేసి వికెట్లు తీసి రాణించారు. అనంతరం 82 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు 5 వికెట్లు నష్టపోయి మూడో రోజు ఆట మిగిలి ఉండగానే విజయలక్ష్యాన్ని చేరుకుంది. జట్టు మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ దేవీ చరణ్ 27, తరుణ్ 25 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టుకు విజయాన్ని అందించారు. రెండు విజయాలతో 12 పాయింట్లు సాధించిన విజయనగరం జట్టు నార్త్‌జోన్ టేబుల్ టాపర్‌గా నిలిచింది. జట్టు వరుస విజయాలు సాధించడంతో జట్టు సభ్యులతో పాటు కోచ్‌లు ఎస్ఎస్ఎస్ బహదూర్, చందక రమేష్, చందక చంద్రశేఖర్‌లను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, సెలెక్టర్లు సర్ఫరాజ్, పీఎస్ఎన్ వర్మ, పి.బంగార్రాజు అభినందించారు.

విశాఖకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

డెంకాడ మండలం చింతలవలసలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల క్రికెట్ మైదానంలో విశాఖ, తూర్పు గోదావరి జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో విశాఖ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో (324/9 డిక్లేర్) భారీ ఆధిక్యం సాధించగా , తూర్పుగోదావరి జట్టు 170 పరుగులు మాత్రమే చేసి ఫాలో ఆన్‌లో పడి రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. సోమవారం మూడో రోజు ఆట మిగిలి ఉంది.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలలో కనీసం 10 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా సేవలు అందించిన వారు అవార్డులకు అర్హులని తెలిపారు. ఉపాధ్యాయులు తమ ప్రతిపాధనలను ఈ నెల 22వతేదీ లోగా మండల విద్యాశాఖాధికారి/డిప్యూటీ ఈఓ కార్యాలయాల ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు.

సీనియర్స్ తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు సిద్ధం


రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయి సీనియర్స్ తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు సిద్ధ మైంది. ఈ నెల 26,27 తేదీల్లో కాకినాడలో జరగనున్న పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం స్థానిక విజ్జీ స్టేడియంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ చారి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 50మందికి పైగా క్రీడాకారులు హాజరు కాగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన వారిలో పురుషుల విభాగంలో ఆర్. శేఖర్, పి.దిలీప్, మణికంఠ, సీహెచ్ సాయి కుమార్, పి.రామకష్ణ, కె అరుణ్ కుమార్, ఎస్. రాహుల్, సాగర్ దొర, కె ఉదయ్ కుమార్ , కె శ్రీనివాసరావు, ఎస్ రవిలు ఉన్నారు. స్త్రీల విభాగంలో బి. స్వాతి, జి.రాధ, ఎస్ నవ్యలు అర్హత సాధించారు.

మోటార్ సైకిల్స్ ఢీకొని ఒకరికి గాయాలు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్‌పై ఆదివారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు బైక్‌లు ఢీకొనడంతో పట్టణంలోని యాత వీధికి చెందిన పురం మణికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడికి సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.


అంబులెన్స్‌లో క్షతగాత్రుడు

దేశ ఉన్నతికి యువత తోడ్పడాలి



మాట్లాడుతున్న ఎస్‌బీ సుదర్శన

విజయనగరం: జిల్లాలో లక్ష మంది యువతను లీడ్ ఇండియాలో భాగస్వాములను చేయాలని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.బి. సుదర్శన ఆచార్య పిలుపునిచ్చారు. స్థానిక కణపాక యూత్ హాస్టల్‌లో ఆరు రోజులుగా జరుగుతున్న లీడ్ ఇండియా శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ప్రొఫెసర్ సుదర్శనాచార్య మాట్లాడుతూ మన దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దడమే లీడ్ ఇండియా ముఖ్య ఉద్దేశమని, అందుకోసం యువత ముందుకు రావాలని కోరారు. దేశ అభివృద్ధిలో యువత భాగస్వాములై క్రమశిక్షణతో జీవితాలను తీర్చిదిద్దుకొని తద్వారా దేశ ఉన్నతికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త జ్ఞానేశ్ గురూజీ, హేమసుందర్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, బి.సూర్యలక్ష్మి, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జీ, విశ్రాంత ఎంపీడీవో శ్రీనివాసరావు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కూరల ధరతో రైతుకు ఊరట

- ప్రకృతి ప్రభావంతో తగ్గిన దిగుబడి
- మార్కెట్‌లో లాభసాటిగా ధరలు


రామభద్రపురం మార్కెట్‌లో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు


మార్కెట్‌కు కూరగాయలు తీసుకొస్తున్న రైతులు

రామభద్రపురం మార్కెట్‌లో కూరగాయల ధరలిలా..	
రకం	క్రేట్ ధర
బీర	రూ.700 నుంచి రూ.800
బెండ	రూ.200 నుంచి రూ.300
వంగ(నల్ల)	రూ.500 నుంచి రూ.600
తెల్ల వంకాయలు	రూ.600 నుంచి రూ.700
గుత్తి వంకాయలు	రూ.600 నుంచి రూ.700
చిక్కుడు(కిలో)	రూ.20 నుంచి రూ.30
కాకర	రూ.500 నుంచి రూ.600
దొండ(యూరియా బస్తా)	రూ.700 నుంచి రూ.800
ఆనప(ఒకటి)	రూ.15 నుంచి రూ.20
బంతి పువ్వులు తట్ట	రూ.250 నుంచి రూ.300
దొండ, దోస	రూ.550 నుంచి రూ.600
ఆగాకర కిలో(దేశ వాళీ)	రూ.80 నుంచి రూ.100

రామభద్రపురం: కూరగాయల సాగు రైతన్నలకు కాసులు కురిపిస్తోంది. సకాలంలో వర్షాలు కురవకపోవడం వల్ల సాగు కొంతమేర ఆలస్యమైంది. తర్వాత కొద్దిపాటి వర్షాలు కురవడంతో రైతులు సాగు చేశారు.పంట పెరుగుతూ పూతకొస్తున్న సమయంలో వర్షాభావం నెలకొనడంతో పంటలు దెబ్బతిన్నాయి. దిగుబడి పడిపోయింది. అయితే రామభద్రపురంలోని అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్లు కూరగాయల సరఫరా లేకపోవడంతో ధరలు పెరిగాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా కూరగాయల పంటలు దెబ్బతినగా మిగిలిన కాస్తోకూస్తో పంటను రైతులు అమ్ముకుంటున్నారు. జిల్లాలో దాదాపు 3 వేల హెక్టార్లలో కూరగాయల సాగవుతాయని అధికారిక సమాచారం. రామభద్రపురం మండలంతో పాటు బొబ్బిలి, బాడంగి, మెరకముడిదాం, మెంటాడ, దత్తిరాజేరు, విజయనగరం, సాలూరు మండలాల్లో కూరగాయల సాగు ఎక్కువ. దొండ, వంగ, బీర, చిక్కుడు, ఆనప, కాకర పంటలు పండిస్తున్నారు. కూరగాయలు పండే రామభద్రపురం మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావంతో పాటు అప్పుడప్పుడు కురిసిన కొద్దిపాటి వర్షాలకు కూరగాయ పంటలు తెగుళ్లు, చీడపీడల కారణంగా దెబ్బతినడం వల్ల దిగుబడి సగానికి సగం పడిపోయింది. కానీ మార్కెట్‌లో పలుకుతున్న ధరలు రైతులకు ఊరట కలిగిస్తున్నాయి. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉండడంతో కూరగాయల రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది.

ఊహించని ధర..



ఇంత ధర ఊహించలేదు.కూరగాయల పంటలు రైతులను ఆదుకుంటున్నాయి.ఈ ధరలు నిలకడగా ఉంటే లాభదాయకంగా ఉంటుంది. నేను ఎకరా విస్తీర్ణంలో బీర సాగు చేస్తున్నాను.వర్షాభావం వల్ల దిగుబడి తగ్గింది.అయినా కాయల నాణ్యతను బట్టి క్రేట్ ధర దాదాపు రూ.800 వరకు పలుకుంతోంది.ధరలు ఆశాజనకంగా ఉండడంతో పెట్టుబడులకు ఢోకాలేదు.

– సీహెచ్ అప్పలనాయుడు, కూరగాయల రైతు

ధరలు ఆశాజనకం



గతం కంటే ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. నేను ప్రతి ఏడాది రెండు మూడు రకాల కూరగాయ పంటలు సాగుచేస్తాను. ఈ ఏడాది కాకర, బీర సాగు చేశాను. గతంలో వాతావరణం అనుకూలించి దిగుబడి బాగున్నప్పుడు రెండు క్రేట్‌ల కూరగాయలు తీసుకొస్తే రూ.600 వచ్చేవి. వాతావరణ పరిస్థితి కారణంగా పంటలు బాగాదెబ్బతినడంతో దిగుబడులు తగ్గాయి. కానీ ఇప్పుడు క్రేట్ కాకర కాయలను రూ.500 నుంచి రూ.600 వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

– చింతల అప్పలనాయుడు,కూరగాయల రైతు

క్లుప్తంగా

శ్రీకూర్మం దేవస్థానం అభివృద్ధికి నిధులు మంజూరు



ధర్మానను కలిసిన శ్రీకూర్మం ఆలయ బోర్డు సభ్యులు

శ్రీకాకుళం రూరల్: శ్రీకూర్మం దేవస్థానం అభివృద్ధికి కోటి రూపాయలను సీజీఎఫ్ ఫండ్ కింద ప్రభుత్వం మంజూరు చేసిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖామాత్యులు ధర్మాన ప్రసాదరావుకు ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఆలయ నిర్వాహకులు కలిసి వివరాలు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం వాటిని మేజర్ పనులకు కేటాయించాలని మంత్రి వెల్లడించారు. మంత్రి ధర్మానను కలిసిన వారిలో ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు పొన్నాడ రుషి, వాసు, తదితరులు ఉన్నారు.

అరసవల్లిలో శ్రావణ శోభ



సూర్యనమస్కార పూజలను చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో శ్రావణ శోభ కనిపించింది. శ్రావణ మాస తొలి ఆదివారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకుని, ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున కుటుంబసమేతంగా ఆదిత్యుడిని దర్శించుకుని సూర్య నమస్కార పూజలు చేశారు. ఈయనకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రావణ తొలి ఆదివారాన ఇతర ప్రాంతాల నుంచి భక్తులు దర్శనానికి విచ్చేయడంతో అరసవల్లి క్షేత్రం సందడిగా మారింది. ఈమేరకు భక్తులకు మంచినీటి నుంచి ఉచిత ప్రసాదం వరకు, అలాగే నిత్యాన్నదానం వరకు అన్ని ఏర్పాట్లను ఈఓ హరిసూర్యప్రకాష్ చేయించారు.

జనావాసాల్లోకి అలుగు



స్థానికులు పట్టుకున్న అలుగు

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ పరిధి స్థానిక చేరివీధిలో గల కిల్లిపోలమ్మ గ్రామదేవత దేవాలయం సమీపంలో ఆదివారం రాత్రి అరుదైన అడవి జంతువు అలుగు కనిపించింది. వీధిలో గుంతలు చేసుకుని వెళుతుండటం గుర్తించిన స్థానికులు దాన్ని పట్టుకున్నారు. ఈ జీవిని చూసేందుకు చుట్టు పక్కల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు.

రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులు



రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంత్యుత్సవాన్ని ఆదివారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి, కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశాన్ని 21వ శతాబ్దంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి పరిచిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేశారని చెప్పారు.

23న ప్రకాశం పంతులు జయంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 23న ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు నిర్వహించడం జరుగుతుందని అన్నా రు. బుధవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలతో అలంకరించి నివాళులర్పిస్తామని తెలిపారు.

అత్యున్నత పరీక్షలు..
అద్వితీయ విజయాలు



- మంచి ర్యాంకులతో సత్తా చాటుతున్న జిల్లా విద్యార్థులు
- ప్రవేశ, నియామక పరీక్షల్లో ప్రతిభ చూపిస్తున్న సిక్కోలు యువత



పి.సువర్ణ



మార్పు దుష్యంత్ కుమార్



డి.శ్వేత



పి.ప్రదీప్



కోట రాజశేఖర్



పేడాడ ప్రదీప్తి



పి.రాజేష్



పి.మనోజ్



కె.రాకేష్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : అత్యున్నత పరీక్షల్లో సిక్కోలు అభ్యర్థులు అద్వితీయ విజయాలు సాధిస్తున్నారు. పరీక్ష ఏదైనా ఫలితాల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. దేశ, రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ప్రతిష్టాత్మక ప్రవేశ, నియామక పరీక్షల్లో జిల్లా యువతీయువకులు సత్తా చాటుతున్నారు. అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తున్నారు. ఉన్నత కొలువులను దక్కించుకుంటున్నారు. మొన్నటికి మొన్న దేశ వ్యాప్తంగా నిర్వహించిన సివిల్స్ పరీక్షల్లో ఇద్దరు విజేతలుగా నిలవగా, రాష్ట్ర స్థాయిలో అత్యున్నత గ్రూప్–1 పరీక్షల్లో తొమ్మిది మంది ఉద్యోగాలను సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 110 మంది ఎంపికవ్వగా అందులో మన జిల్లాకు చెందిన వారు తొమ్మిది మంది ఉండటం గర్వకారణం.

జిల్లా ఇప్పుడు వెనుకబాటు తనాన్ని వెనక్కి నెట్టి ఉన్నత శిఖరాల వైపు దూసుకుపోతోంది. ముఖ్యంగా యువత ఉన్నత లక్ష్యాలతో దూసుకుపోతున్నారు. ప్రణాళికాబద్ధంగా కష్టపడి, రేయింబవళ్లు చదివి అనుకున్న లక్ష్యాలను సాధిస్తున్నారు. తాజాగా గ్రూప్–1 పరీక్షల ఫలితాలు ఆ విధంగా తేటతెల్లం చేశాయి. తల్లిదండ్రుల ఆశయాలను, కుటుంబ సభ్యుల ఆశలను నెరవేర్చుతూ తొమ్మిది మంది ఉన్నత కొలువులు సాధించారు. కొందరికి తొలి ప్రయత్నంలో విజయం వరించగా, మరికొందరు రెండు, మూడు ప్రయత్నాల్లో అనుకున్నది సాధించారు. వ్యవసాయ, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారైనా పట్టుదలతో ప్రయత్నించి అనుకున్నది సాధించారు.

గ్రూప్– 1లో విజేతలు

- సంతబొమ్మాళి మండలం ఆకాశ లక్కవరం గ్రామానికి చెందిన పరపటి ధర్మారావు కుమార్తె పరపటి సువర్ణ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. రెండేళ్ల కిందట గ్రూప్–2పాసై జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఏఓగా పనిచేస్తున్న ఆమె ఇప్పుడు ఏకంగా గ్రూప్–1లో సత్తా చాటారు.
- నరసన్నపేట మండలం మాకివలస పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మార్పు దుష్యంత్‌కుమార్ రాష్ట్ర పన్నుల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సంతబొమ్మాళి మండలం దండు గోపాలపురం గ్రామానికి చెందిన దుష్యంత్ ఎంబీబీఎస్ చేసి మెడికల్ ఆఫీసర్ ఉద్యోగంలో చేరి, కొన్నాళ్ల తర్వాత గ్రూప్–1కు ప్రిపేరయ్యారు.
- శ్రీకాకుళం నగరానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి గ్రూప్–1 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులో నివాసముంటున్న బీసీ సంక్షేమ శాఖ రిటైర్డు వార్డెన్ పోలుమహంతి ఉమామహేశ్వరరావు పెద్ద కుమారుడు పి.వెంకట సాయిరాజేష్ అగ్ని మాపక అధికారి పోస్టుకు, చిన్న కుమారుడు పి.వెంకట సాయి మనోజ్ వైద్య ఆరోగ్యశాఖ పరిపాలనాధికారి పోస్టుకు ఎంపికయ్యారు.
- ఆమదాలవలస మండలం కొర్లకోటకు చెందిన పేడాడ ప్రదీప్తి గ్రూప్–1లో డీఎస్పీ పోస్టు సాధించారు. రెండేళ్ల క్రితం ఆమె గ్రూప్–2 పరీక్షలో విజయం సాధించారు. ఎక్సైజ్ ఎస్ఐగా పనిచేశారు. ప్రదీప్తి తల్లిదండ్రులు అప్పారావు, సుగుణవేణిలిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. ఈమె సోదరి ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్‌గా ఎంపికై ప్రస్తుతం భారత్ తరపున ఐక్యరాజ్య సమితి భద్రతా విభాగంలో కొనసాగుతూ సూడాన్‌లో పనిచేస్తున్నారు.
- శ్రీకాకుళం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దండా శ్వేత తొలి ప్రయత్నంలోనే గ్రూప్–1కు ఎంపికై మండల అభివృద్ధి అధికారి పోస్టు సాధించారు. తండ్రి ఆనందరావు పంచాయతీ కార్యదర్శిగా, తల్లి విజయలక్ష్మీ ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.
- ఆమదాలవలస మండలం కలివరం పంచాయతీ తమ్మయ్యపేట గ్రామానికి చెందిన కోట రాజశేఖర్ గ్రూప్–1కు ఎంపికై ట్రెజరీ అధికారి పోస్టు సాధించారు. తల్లిదండ్రులు వెంకట రామారావు, సీతమ్మ ప్రోత్సాహంతో ఉన్నత స్థాయికి చేరుకున్నారు. రాజశేఖర్ సోదరుల్లో ఒకరు వైద్యుడిగా స్థిరపడగా, మరొకరు సివిల్స్‌కు ప్రిపేరవుతున్నారు.
- పొందూరు మండలం కనిమెట్ట గ్రామానికి చెందిన కూన రాకేష్ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్‌గా ఎంపికయ్యారు. సివిల్స్‌కు ప్రిపేరవుతుండగా గ్రూప్–1లో విజయం సాధించారు.
- నరసన్నపేట మండలం బడాం గ్రామంలోని సామాన్య కుటుంబానికి చెందిన పైడి ప్రదీప్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. సివిల్స్ కోచింగ్ తీసుకుంటూ గ్రూప్–1లో విజేతగా నిలిచారు.

నీట్, అగ్రికల్చర్ విభాగంలో..

- పోలాకి మండలం గొల్లవలస పరిధిలోని తోటాడ గ్రామానికి చెందిన బోర వరుణ్ చక్రవర్తి దేశవ్యాప్తంగా నిర్వహించి నీట్ పరీక్షల్లో ఆల్‌ఇండియా మొదటి ర్యాంకు సాధించారు. తెలంగాణ ఎంసెట్‌లో అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో ఐదో ర్యాంకు సాధించగా, ఆంధ్రప్రదేశ్ ఎంసెట్ అగ్రికల్చర్ అండ్ మెడికల్ విభాగంలో రెండో ర్యాంకు సాధించారు.
- పొందూరుకు చెందిన సాయి వెంకట్ యశ్వంత్‌నాయుడు ఏపీ ఎంసెట్‌లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో స్టేట్ 7వ ర్యాంకు సాధించారు.
- శ్రీకాకుళం పీఎస్ఎన్ఎం స్కూల్ సమీపంలోని కొన్నా వీధికి చెందిన పాట్నూరు ఆశిష్ ఏపీ ఎంసెట్‌లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో స్టేట్ 9వ ర్యాంకు సాధించారు. నీట్ పరీక్షల్లో ఆలిండియా 57వ ర్యాంకు సాధించారు. ఓబీసీ కేటగిరీలో 12వ ర్యాంకు సాధించారు.

ఇంజినీరింగ్ పరీక్షల్లో..

- తెలంగాణ ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగంలో సనపల అనిరుధ్ మొదటి ర్యాంకు సాధించాడు. నందిగాం మండలం దిమిలాడ గ్రామానికి చెందిన అనిరుద్ సనపల ఖగేశ్వరరావు, ఝాన్సీల కుమారుడు. ఈయనకు జేఈఈ మెయిన్స్‌లో 122, జేఈఈ అడ్వాన్సులో 274వ ర్యాంకు సాధించాడు.
- శ్రీకాకుళంలోని అరసవిల్లికి చెందిన బోయిన సంజన తెలంగాణ ఎంసెట్‌లో ఇంజినీరింగ్ విభాగం నుంచి 8వ ర్యాంకు సాధించారు. గణేష్, భాగ్యజ్యోతి దంపతుల కుమార్తె సంజన ఇటీవల వెలువడిన ఏపీ ఎంసెట్‌లో 20వ ర్యాంకు సాధించారు. జేఈఈ అడ్వాన్సులో 282వ ర్యాంకు సాధించారు.
- శ్రీకాకుళానికి చెందిన డోల సూర్యసాయి జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా 106 ర్యాంకు సాధించారు. జేఈఈ అడ్వాన్సులో 302వ ర్యాంకు సాధించారు.
- ఆమదాలవలసకు చెందిన ఎంవీవీ హర్షవర్ధన్ జేఈఈ మెయిన్స్‌లో 211, జేఈఈ అడ్వాన్సులో 131ర్యాంకు సాధించారు. ఏపీ ఎంసెట్‌లో కూడా హర్షవర్ధన్ 29వ ర్యాంకు సాధించారు.

అప్పట్లో సివిల్స్‌లోనూ..

- శ్రీకాకుళం మండలం ఒప్పంగి గ్రామానికి చెందిన చల్లా కళ్యాణి దేశ వ్యాప్తంగా నిర్వహించిన యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ 2022 పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 286ర్యాంకు సాధించారు. సివిల్స్‌లో మెరిసిన కళ్యాణి తండ్రి అసిరినాయుడు వ్యవసాయంతో పాటు తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నారు.
- సారవకోట మండలం అలుదు గ్రామంలో తన తాతయ్య పొన్నాన కృష్ణమూర్తి ఇంట్లో ఉంటూ చదువుకున్న భవిరి సంతోష్‌కుమార్ సివిల్స్‌లో 607ర్యాంకు సాధించి సత్తా చాటారు.

పాలిటెక్నిక్, పీజీ ప్రవేశ పరీక్షల్లో

- పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ పాలిసెట్–2023 ఫలితాల్లో పలాస–కాశీబుగ్గలోని టీచర్స్ కాలనీకి చెందిన లఖినాన వెంకటాచలం, శ్రీదేవి దంపతుల కుమారుడు శ్రీకర్ స్టేట్ 16వ ర్యాంకు సాధించారు. ఎచ్చెర్ల మండలం బుడుమూరు గ్రామానికి చెందిన విక్రమ్‌రాజా స్టేట్ 37ర్యాంకు సాధించారు.
- ఏపీ పీజీ సెట్‌లో శ్రీకాకుళం నగరానికి చెందిన మాలి ప్రవీణ్‌కుమార్ ఫార్మసీ విభాగంలో మొదటి ర్యాంకు సాధించారు. అలాగే, నగరానికి చెందిన సింహాద్రి లహరి కూడా జియో ఇంజినీరింగ్ అండ్ జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో ప్రథమ ర్యాంకు సాధించారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు బహుమతులకు అందజేస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ప్రసాదరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి పాఠశాల విద్యార్థుల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళల విభాగంలో సానివాడ, ఎచ్చెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. బాలుర విభాగంలో కేశవరావుపేట, ఎచ్చెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు తొలి రెండు స్థానాల్లో నిలిచారు. వీరికి ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ డి.ప్రసాదరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీడీ నరేష్, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రాంబాబు, వరప్రసాద్ పాల్గొన్నారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, మహిళలు

పాతపట్నం: మండలంలోని పెద్దసున్నాపురం గ్రామంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో వన్‌ధన్ వికాస్ కేంద్రంలో జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆదివారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రాంభించారు. సుమారు రూ.15.50 లక్షల ఖర్చుతో జీడిపప్పు ప్రాసెసింగ్ యంత్రాలు ఏర్పాటు చేశామని వెలుగు ఏపీఎం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేయూత అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రదీప్, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునరావు, ఏపీఎం మనోరత్నం, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సీతమ్మ, వీడీవీకే అధ్యక్షురాలు సందరమ్మ, కోశాధికారి శీదేవి, మీనాక్షి, సీసీలు అప్పలస్వామి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రజలకు అంకితం

- చినబడాం–అంతరకుడ్డ రోడ్డు ప్రారంభం



రోడ్డు ప్రారంభంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు

కాశీబుగ్గ: చినబడాం–అంతరకుడ్డ బీటీ రోడ్డు ప్రజలకు అంకితం చేసి గ్రామ ప్రజల చిరకాల కోరికను నెరవేర్చగలిగామని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఆరో వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వైద్యుడిగా సేవలు అందిస్తున్న సమయంలో అంతరకుడ్డ గ్రామంలో ఒక వ్యక్తి పాము కాటుకు గురైతే తనకు ఫోన్ చేశారని, వెంటనే ఆస్పత్రికి తరలిస్తుంటే గేటు పడటం వల్ల లేటైందని, దీంతో కాశీబుగ్గ వైపు బైక్‌పై తీసుకెళ్లారని గుర్తు చేశారు. అందుకే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక కాశీబుగ్గ ఎల్‌సీ గేటు నిర్మాణం సమస్యలన్నీ పరిష్కరించి పనులు చేస్తున్నామన్నారు. చినబడాం నుంచి అంతరకుడ్డ గ్రామం వరకు ఉన్న రహదారి ధ్వంసమైపోయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఎన్నికల ముందు అంతరకుడ్డ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రోడ్డు నిర్మించామన్నారు. కల్వర్టు నిర్మాణంతో కలసి రూ.కోటి రూపాయలు ఖర్చు చేసి మంచి రహదారి అందించామని అన్నారు. సీఎం వైఎస్ జగన్ విద్య, వైద్యం, వ్యవసాయం అన్ని రంగాలకు మంచి చేస్తున్నారని వివరించారు. చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల వేళ మళ్లీ అబద్ధాలు చెబుతున్నారని, పద్నాలుగేళ్లు ఆయన చేయని పనులను ఇప్పుడు చేస్తానని చెబుతున్నారని దుయ్యబట్టారు. ఆయన మాటలు నమ్మవద్దని సూచించారు.

కార్యక్రమంలో పలాస–కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, వైస్ చైర్మన్లు మీసాల సురేష్ బాబు, బోర కృష్ణారావు, హనుమంతు వెంకటరావుదొర, పార్టీ నాయకులు దువ్వాడ రమణయ్య, బల్ల శ్రీనివాస్‌దొర, మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, కోఆప్షన్ మెంబర్లు రోణంకి శ్రీనివాసరావు, బమ్మిడి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విషాద తీరం

- సముద్రంలో మునిగి విద్యార్థిని మృతి
- అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో ఘటన



సుంకు అక్షయ (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్, కాశీబుగ్గ: మండలంలోని అక్కుపల్లి శివసాగర్ సముద్ర తీరంలో మునిగి ఆదివారం సుంకు అక్షయ(13) అనే విద్యార్థిని మృతి చెందింది. పోలీసులు, తోటి స్నేహితులు తెలిపిన వివరాలు మేరకు.. ఆదివారం పాఠశాల సెలవు కావడంతో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల మారుతీ నగర్‌కు చెందిన సుంకు అక్షయ(13) కొంత మంది కాలనీ వాసులు కలిసి అక్కుపల్లి శివసాగర్ బీచ్‌కు వెళ్లారు. తీరంలో కొద్దిసేపు ఆనందంగా గడిపి సముద్ర స్నానానికి దిగారు. అంతలోనే ఓ రాకాసి అల రావడంతో అక్షయ సముద్రం లోపలకు వెళ్లిపోయింది. ఆమెను కాపాడేందుకు కింతాడ రాజేశ్వరి ప్రయత్నించి ఆమె కూడా చిక్కుకుపోయింది. దీన్ని గమనించి తోటి పర్యాటకులు సముద్రంలో మునిగిపోతున్న వారిని ఒడ్డుకు తీసుకువచ్చారు. 108 వాహనంలో వారిని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అక్షయ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో బాధితురాలు రాజేశ్వరికి సకాలంలో వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పింది. సుంకు అక్షయ పలాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. మృతురాలి తల్లిదండ్రులు సుంకు కృష్ణవేణి, అర్జున్‌లు జీడి కార్మికులు. ఈ విషాద ఘటనపై వజ్రపుకొత్తూరు పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. శవ పంచనామా చేసి పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం కోసం ఉంచారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు మధుసూదన్‌రావు తెలిపారు.

శ్రీకాకుళంలో అర్ధరాత్రి చోరీ



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని అరసవల్లి లక్ష్మీనగర్ కాలనీలోని కొర్లా గణేష్ ఇంటి లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గణేష్ కుటుంబ సభ్యులంతా తమ కుమార్తెను చూసేందుకు పారాదీప్ వెళ్లారు. ఆదివారం ఉదయం ఆ ఇంటి తలుపులు బార్లా తెరిచి ఉండడంతో పక్కింటి వాళ్లు చూసి గణేష్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఆ తర్వాత పోలీసులకు సమాచారం అందడంతో వారు ఇంటి యజమానులతో మాట్లాడారు. క్లూస్‌టీమ్‌తో పరిశీలించారు. బాధితుడి మావయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థుల పరిశ్రమల సందర్శన

టెక్కలి: ఎంబీఏ విద్యార్థులకు తమ విద్యలో భాగంగా పరిశ్రమల సందర్శన ఎంతో కీలకమని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు అన్నారు. కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యా ర్థులంతా ఆదివారం చిలకపాలెంలో గల నాగార్జున అగ్రో కెమికల్ కంపెనీని సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమల స్థాపన, నిర్వహణ, వాణిజ్య వ్యవహారాలు, ఆయా వ్యాపార రంగంలో ఒడుదొడుకులు, పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకు రుణాలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భనలో అధ్యాపకులు డి.ప్రణయ, వి.గోపాలకృష్ణ, శ్రీనివాసరావు, బి.శివకుమార్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..



వివాహ వేడుకల్లో పాత రీతులు మళ్లీ కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన ఓ వివాహ వేడుకలో వధూవరులను ఇలా గుర్రపు బగ్గీపై ఊరేగించారు. చాలాకాలం తర్వాత గుర్రపు బగ్గీ కనిపించడంతో స్థానికులు ఆసక్తిగా గమనించారు. – శ్రీకాకుళం

'రూల్స్ పాటించాల్సిందే'



యువతకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాసరావు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండల పరిధిలో ట్రిపుల్ రైడ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న 28 మంది యువకులను కాశీబుగ్గ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. కాశీబుగ్గ పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో 28 మందిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మొదటిసారి పట్టుబడిన వారిని హెచ్చరికగా విడిచిపెడుతున్నామని, అనంతరం దొరికితే కోర్టుకు పంపిస్తామని అన్నారు. అధికంగా ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా, మద్యం మత్తులో వాహనం నడపడం, సరైన పత్రాలు లేకుండా వాహనాలు తిప్పడం వంటివాటిపై చర్యలు చేపడతామని అన్నారు.

విద్యాశాఖలో గందరగోళం!

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖలో గందరగోళం నెలకొంది. డీఈఓ (ఎఫ్ఏసీ)బాధ్యతలను ఏడీ కె.వెంకటేశ్వరరావుకు ఈ నెల 6వ తేదీన అప్పగించారు. ఆయన తర్వాతి రోజే విధుల్లో చేరారు. అంతవరకు ఇన్‌చార్జి డీఈఓ బాధ్యతలు చూసిన ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి రిలీవ్ అయ్యారు. అయితే ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకు జిల్లా నుంచి పలువురు ఉపాధ్యాయులను భీమిలిలో జరుగుతున్న సిమేట్– సమగ్ర శిక్ష ఉమ్మడిగా అందిస్తున్న టీచర్ లీడర్‌షిప్ ప్రోగ్రాంకై ఆరు రోజుల శిక్షణ తరగతులకు హాజరుకమ్మని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల్లో డీఈఓ పేరు ఎం.జ్యోతికుమారి అని, అలాగే ఉత్తర్వుల దిగువన కుడివైపు డీఈఓగా కె.వెంకటేశ్వరరావు పేరును ముద్రించారు. ఒకే ఉత్తర్వులు ఇద్దరు డీఈఓల పేర్లు ఉండడంతో ఆ శాఖలో గందరగోళం నెలకొంది.